సాక్షి
శ్రీకాకుళం

ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024



ఎక్కడి పడవలు అక్కడే..

వానల వల్ల మత్స్యకారులు ఇబ్బంది పడుతున్నారు. పలు ప్రాంతాలు జలమయమయ్యాయి.

- 8లో



ఆకులతంపరలో..

ఆకులతంపరలో ఇసుక దందా జరుగుతోంది. ఒడిశా బిల్లులు చూపి దర్జాగా ఇసుక తరలించేస్తున్నారు.

- 8లో

ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు నాలుగో విడత కౌన్సెలింగ్ పూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: ఆర్‌జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌కు సంబంధించి నాలుగో విడత (తుది విడత) కౌన్సెలింగ్ ఆర్‌కే వ్యాలీలో శనివారం నిర్వహించారు. 1100 సీట్లకు 54 ఖాళీలు ఉండగా, ఈ సీట్లకు మెరిట్ వెయిటింగ్ లిస్ట్, క్యాంపస్ మార్పు ఆప్షన్ల ఆధారంగా ప్రవేశాలు కల్పించారు. సీట్లు లభించిన విద్యార్థులు రెండు రోజుల్లో క్యాంపస్‌లో చేరాలని సూచించారు.

న్యూస్‌రీల్

తుఫాన్‌పై సిద్ధంగా ఉండాలి



మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆదివారం సెలవు దినం అయినప్పటికీ అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని, జిల్లాలో ఎవరికి ఏ అవసరం వచ్చినా వెనువెంటనే స్పందించాలని సూచించారు. ఎప్పటికప్పుడు రైతులకు తుఫాన్‌పై అప్రమత్తం చేసి పంటలు నష్టపోకుండా చూడాలన్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

సుడా వీసీ ఓబులేసుకి బదిలీ



చల్లా ఓబులేసు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): సుడా వైస్ చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్న చల్ల ఓబులేసు పురపాలకశాఖ ప్రధాన కార్యాలయానికి రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల ముందు ఓబులేసును సుడా వైస్ చైర్మన్‌గా నియమించారు. మున్సిపల్ కార్పొరేషన్ శ్రీకాకుళం కమిషనర్‌గా ఓబులేసు సుదీర్ఘకాలంపాటు విధులు నిర్వహిస్తూ కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి అధికారులు, ప్రజలకు సేవల్ని అందించి అందరి మన్ననలు పొందారు. ఇటీవల తమీమ్ అన్సారియా బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో మళ్లీ ఆయనకే బాధ్యతలు అప్పగించిన సంగతి అందరికీ తెలిసినదే. కొత్తగా దుర్గాప్రసాదరావుని శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్‌గా విశాఖపట్నం నుంచి బదిలీ చేశారు.

వెలగాడలో 'పరిస్థితి విషమం'

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి



వెలగాడ హెల్త్ క్లినిక్‌లో రోగులకు వైద్యసేవలను అందిస్తున్న డాక్టర్లు అనుషా, ప్రతిష్ట శర్మ



మృతి చెందిన నాగమ్మ (ఫైల్)

జి.సిగడాం: వెలగాడలో అతిసార వ్యాధి ఆందోళనలు రేకెత్తిస్తోంది. గ్రామానికి చెందిన కోలా నాగమ్మ (70) డయేరియా లక్షణాలతో శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందింది. ఆమె నాలుగు రోజుల క్రితం గ్రామంలో హెల్త్ క్లినిక్‌లో ఏర్పాటు చేసిన వైద్యం కోసం వచ్చిందని వైద్యులు అనూషా, ప్రతిష్టశర్మ వెల్లడించారు. పరిస్థితి బాగు లేకపోవడంతో రిమ్స్‌కు తరలించామని, కిడ్నీలు, ఇతర ఆరోగ్య సమస్యలు ఉండడంతో చనిపోయిందని తెలిపారు. గ్రామంలో సుమారుగా 32 మంది వరకు బాధితులు ఉన్నారు. స్థానికంగా 15 మందికి చికిత్స అందించినా పరిస్థితి విషమించడంతో వారిని శ్రీకాకుళం, రాజాం ఆస్పత్రులకు తరలించారు. మరో 17మందికి ఇక్కడే చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఊరిలో ప్రతిరోజూ సర్వే నిర్వహిస్తున్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు చేస్తున్నారు.



ఇంటిని గ్రీన్ హౌస్‌గా మార్చిన ప్రసాదరావు

సండే స్పెషల్

GREEN HOME

పొదరిల్లు

మొక్కవోని ఉల్లాసం

- ఇంటిని పొదరింటిలా మార్చుకున్న విశ్రాంత అధికారి
- బృందావనంలా కనిపిస్తున్న ఇళ్లు

ఆ ఇంటి గోడపై ఎండ పొడ పడదు. ఏడాదంతా ఆ గోడకు లతలు పెనవేసుకునే ఉంటాయి. ఆ వసారాలో వేడి అన్నదే కనిపించదు. భూమి నుంచి మొలిచిన పచ్చటి గొడుగొకటి ఇంటికి సూరీడికి మధ్య ఓజోన్‌లా ఆవరించి ఉంటుంది. అటుగా వచ్చిన వారిని ఆ మొక్కలు ఎంచక్కా పలకరిస్తాయి. పారిజాత పుష్పాలు గాలిలో పన్నీరు జల్లి స్వాగతం పలుకుతాయి. రెండు వందల రకాల మొక్కలు 'మా పేర్లు తెలుసా..' అంటూ మెదడుకు పరీక్ష పెడతాయి. అడుగడుగునా మొక్కలు, నలుచెరగులా పచ్చదనం, ఎటు చూసినా ఆహ్లాదకర వాతారణంతో ఓ విశ్రాంత అధికారి ఆకుపచ్చని జ్ఞాపకాలు పోగు చేసుకుంటున్నారు. అభిరుచిలా మొదలై అలవాటుగా మారి మొక్కలతో చుట్టరికం కలిపేసుకున్నారు. ఎచ్చెర్ల మండలంలో ఎస్ఎంపురం సమీపంలోని రాజీవ్ స్వగృహ ఆనమిత్ర కాలనీలోకి ఓ సారి వెళ్తే..





కాక్టస్ జాతి మొక్క



ఆంథూరియం పుష్పం



కారిడార్‌లో మొక్కలతో అలంకరణ

ఎచ్చెర్ల క్యాంపస్:

ఉద్యోగ జీవితం ముగిసిపోయింది. పిల్లలు వేరే ప్రాంతాల్లో స్థిరపడిపోయారు. ఆ భార్యాభర్తలు మళ్లీ నవ దంపతుల్లా మిగిలిపోయారు. శేష జీవితం ఎలా గడుపుదామా అని ఆలోచించారు. ఓ ఇంటిని కొనుక్కుని అందులో వారి అభిరుచి మేరకు కొన్ని మొక్కలు నాటి నీరు పోశారు. కొన్నాళ్లకు కాసింత ఎదిగిన మొక్కలు మీ జీవితానికి అర్థం మేమే అనేంతలా వారితో అల్లుకుపోయాయి. ఉదయాస్తమయాల్లో దంపతులు ఆ మొక్కలకు నీరు పోసి సంతృప్తి పడ్డారు. కొమ్మలు కదలాడినా, కుసుమాలు పూసినా సంబరపడిపోయారు. అంతే.. అప్పటి నుంచి రకరకాల మొక్కలు తెచ్చి వాటిని పెంచుతూ ఇంటిని పొదరింటిలా మార్చుకున్నారు.

పంచాయతీ రాజ్ విశ్రాంత ఎస్ఈ కేఎంవీ ప్రసాదరావు, భార్య శేషరత్నాంబలు ఈ పొదరింటి యజమానులు. వీరి కుమారుడు ప్రీతమ్ చెన్నైలో కుమార్తె ప్రియాంక ముంబైలో ఉద్యోగాలు చేస్తున్నారు. వీరు ఎచ్చెర్ల మండలంలో ఎస్ఎంపురం సమీపంలోని రాజీవ్ స్వగృహ ఆనమిత్ర కాలనీలో 2017లో ఇళ్లు కొనుక్కున్నారు. ఇప్పుడా ఇళ్లు పొదరిల్లులా మారింది. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ప్రసాదరావు శ్రీకాకుళం పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగంలో పలు హోదాల్లో పాతపట్నం, పలాస, సోంపేట వంటి ప్రాంతాల్లో పనిచేశారు. అద్దె ఇళ్లలో ఉంటూ టెర్రస్‌పై మొక్కలు పెంచడం అలవాటు చేసుకున్నారు. చివరకు సొంతింటిలో 2017 నుంచి పూర్తిస్థాయిలో మొక్కలు పెంచుతూ గ్రీన్ హౌస్‌గా మార్చేశారు.



మొక్కల సేకరణకు, పెంపకానికి చేస్తున్న ఖర్చు ఏడాదికి రూ.2 లక్షలు

న్యూజిలాండ్ ద్రాక్ష, 20 రకాల మామిడి మొక్కలు, ఎర్ర పనస, టెక్సాస్ రేవాన్, పారిజాతం, ఇన్సులిన్ ప్లాంట్, బ్రహ్మకమలం, అత్రియం, పలు రకాలు క్యాటాన్స్, కందేలియా నలంక, బ్లీడింగ్ హార్ట్, ఫ్లేమింగ్ టార్చ్, మర్రి, రావి దశాబ్దాల జీవితం కలిగిన బోన్సాయ్, పలు రకాల కాక్టస్ జాతి, లిటిల్ క్యాండిల్ థాయ్‌లాండ్ నేరేడు, ఆశాన వల్లి వంటి అనేక రకాలు వీరింటిలో కనిపిస్తాయి.

మొక్కల నుంచి బయటపడిన ఆకులు, పువ్వులు సైతం కంపోస్టు ఎరువుగా మార్చి మొక్కలకు వాడుతున్నారు.

ఎన్నెన్నో అందాలు..

సాధారణంగా ఎవరైనా విహార యాత్రలకు వెళ్తే అరుదైన వస్తువులు కొని ఇంటికి తెచ్చుకుంటారు. కానీ వీరు మాత్రం ఎక్కడకు వెళ్లినా మొక్కలు కొని తెచ్చుకోవడం అలవాటు చేసుకున్నారు. అందుకే ఆ ఇంటిలో రెండు వందల రకాలకుపైగా మొక్కలు నవ్వుతూ కనిపిస్తుంటాయి.

కాలనీ మొత్తం పచ్చగా మారాలి



ప్రస్తుతం మా కాలనీ ప్రారంభం నుంచి మొక్కలు నాటాం. కాలనీ అంతా పచ్చగా కనిపించాలనేది నా ఆకాంక్ష. అందుకోసం నా వద్ద ఉన్న మొక్కలతో నర్సరీ ఏర్పాటు చేస్తాను. ఇక్కడ మొక్కలు బాగా పెరుగుతాయి. మా భార్యాభర్తలకు ఉన్న పూర్తి సమయాన్ని మొక్కలు నాటేందుకు కేటాయిస్తాం. తీగ జాతి మొక్కలతో మా ఇల్లంతా పచ్చగా చల్లగా ఉంటుంది.

– కేఎంవీ ప్రసాదరావు, విశ్రాంత పంచాయతీ రాజ్ ఎస్ఈ



తుఫాన్‌పై అప్రమత్తత

- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- తీర ప్రాంత మండలాలకు ప్రత్యేకాధికారుల నియామకం



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్ : పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారి శనివారం అర్ధరాత్రి తీరం దాటుతుండటంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నుంచి అధికారులను అప్రమత్తం చేశారు. తీర ప్రాంత మండలంలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకూడదని, అన్ని శాఖల అధికారులు ప్రజలకు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని, నాగావళి, వంశధార నదీపరీవాహక ప్రాంతాల్లో మరింత అప్రమత్తత అవసరమని అన్నారు.

తుఫాను, ఇతర భారీ నష్టాలకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే జిల్లాకేంద్రంలో ఉన్న కంట్రోల్ రూం ఫోన్ నంబర్ **08942 240557**కు ఫోన్ చేయాలని సూచించారు. తీర ప్రాంత మండలాలకు ప్రత్యేకాధికారులను నియమించామన్నారు.

ప్రత్యేకాధికారులు వీరే..

రణస్థలం: కొవ్వాడ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మణమూర్తి (ఫోన్ నంబర్ 9121251111)

ఎచ్చెర్ల: డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు (8790008399)

శ్రీకాకుళం: జెడ్పీ సీఈఓ డి.వెంకటేశ్వరరావు (9100997770)

గార: ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ (9440814582)

పోలాకి: డీపీఓ ఆర్.వెంకటరామన్ (8919364818)

సంతబొమ్మాళి: వంశధార యూనిట్-4 ప్రత్యేకాధికారి జీవీఎస్.రామ్మోహనరావు (9440422302)

వజ్రపుకొత్తూరు: జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ ఉమామహేశ్వరరావు (9866530885)

మందస: జిల్లా కోపరేటివ్ అధికారి బి.నగేష్ (7093930101),

సోంపేట: మైన్స్ డీడీ ఎస్.కె.వి.సత్యనారాయణ (9502225511)

కవిటి: ఉద్యానవనశాఖాధికారి ఆర్.వి.ప్రసాద్ (7995086758)

ఇచ్ఛాపురం: డ్వామా ఏపీడీ సీహెచ్ శ్రీనివాసరెడ్డి (6309998070)

తీరం వెంబడి గాలులు

శ్రీకాకుళం, క్రైమ్, పాతబస్టాండ్ : తుఫాన్ కారణంగా తీర ప్రాంత గ్రామాల్లో రాత్రి తొమ్మిది గంటల నుంచి ఈదురుగాలులు ప్రారంభమయ్యాయి. కళింగపట్నం సమీపంలో తుఫాన్ తీరం దాటే అవకాశం ఉండడంతో రెవెన్యూ శాఖ, మత్స్యశాఖాధికారులు, పోలీసులు తీర ప్రాంతమంతా అప్రమత్తం చేస్తూ ప్రచారాలు నిర్వహించారు. రాత్రంతా అప్రమత్తంగా ఉన్నారు. వర్షాలు కూడా తీవ్రం కావడంతో మత్స్యకారులంతా బిక్కుబిక్కుమంటూ ఇళ్లలోనే గడిపారు. సముద్రం కూడా అలజడిగా ఉంది. శ్రీకాకుళం, గార మండలాల తీర ప్రాంత పరిధిలో గాలుల తీవ్రత ఎక్కువగా కనిపించింది. గాలులకు విద్యుత్ తీగలు తెగే అవకాశం ఉందని, జనం బయటకు వెళ్లవద్దని విద్యుత్ శాఖాధికారులు సూచించారు. జిల్లా మొత్తం మీద శనివారం 488.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సగటున 16.3 మిల్లీ మీటర్లుగా నమోదైంది.



గార మండలం బందరువానిపేటలో ప్రజలను అప్రమత్తం చేస్తున్న సీఐ బూర ప్రసాద్, మెరైన్ పోలీసులు

వర్షపాతం (మిల్లి మీటర్లలో)

సంతబొమ్మాళి	జలుమూరు	నందిగాం	పొందూరు	ఆమదాలవలస	వజ్రపుకొత్తూరు	ఎచ్చెర్ల	ఇచ్ఛాపురం	మందస	సరుబుజ్జిలి	టెక్కలి	కోటబొమ్మాళి	బూర్జ	నరసన్నపేట
46.0	29.4	28.6	6.0	24.0	28.6	12.4	29.8	16.8	10.6	23.6	21.4	10.0	11.6

సారవకోట	పలాస	పోలాకి	కవిటి	రణస్థలం	శ్రీకాకుళం	లావేరు	ఎల్ఎన్‌పేట	జి.సిగడాం	కంచిలి	మెళియాపుట్టి	గార	పాతపట్నం	హిరమండలం	కొత్తూరు
21.4	19.6	17.2	9.4	9.2	19.0	9.8	7.4	7.8	10.0	8.2	11.4	14.8	10.6	11.6

నెల మారింది.. సంఖ్య తగ్గింది

- కొనసాగుతున్న పింఛన్ల కోత
- నెలలు మారుతున్న కొద్దీ తగ్గుతున్న పింఛన్‌దారుల సంఖ్య
- తమకు అనుకూలంగా లేని వారి పేర్లు తీసేస్తున్న ప్రభుత్వ పెద్దలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఒకటో తేదీ వస్తే చాలు అంకెలన్నీ మారిపోతున్నాయి. పింఛన్ల జాబితాలో లబ్ధిదారుల సంఖ్య అనూహ్యంగా తగ్గిపోతోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గరి నుంచి ఈ కోత కొనసాగుతోంది. పింఛన్ మొత్తాన్ని పెంచామని చెప్పుకుంటూనే.. తమకు అనుకూలంగా లేని వారిపై అనర్హుల ముద్ర వేసి పింఛన్లను ప్రభుత్వ పెద్దలు తొలగించేస్తున్నారు. ఊహించని పరిణామానికి బెంబేలెత్తుతున్న లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. పలు చోట్ల ఆవేదనతో నిలదీస్తున్నారు.

కొనసాగుతున్న కక్ష సాధింపు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కులం,మతం, పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ పింఛన్లు అందజేశారు. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం కక్ష సాధింపు ధోరణి విడిచిపెట్టడం లేదు. 2014–19 పాలనను రిపీట్ చేసి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు వస్తున్న కాసింత ఆధారాన్ని కర్కశంగా దూరం చేస్తోంది. వైఎస్సార్‌సీపీకి ఓట్లేశారనే ఆక్రోశంతో పింఛన్లను తీసేస్తోంది.

ప్రతి నెలా తొలగింపు..

కూటమి అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి ప్రతి నెలా పింఛన్ల కోత పెడుతోంది. జూన్‌లో 3,19,702 పింఛన్లు ఉంటే జూలైకి వచ్చేసరికి 3,19,147కి తగ్గిపోయింది. ఒక్క నెల వ్యవధిలో 555 పింఛన్లు ఆపేసింది. ఆగస్టుకు వచ్చేసరికి ఆ సంఖ్య 3,18,017కి పడిపోయింది. ఈ నెల వ్యవధిలో 1130 మంది పింఛన్లు తొలగించింది. సెప్టెంబర్ నెలకొచ్చేసరికి ఆ సంఖ్య 3,16,883కి కుదించింది. ఆగస్టు, సెప్టెంబర్ మధ్య 1134 పింఛన్లు నిలిపేసింది. మొత్తంగా చూస్తే ఈ ప్రభుత్వంలో ఇప్పటివరకు 2,819 మంది పింఛన్లు తీసివేసింది. ఈ నెలలో 3,16,883 మంది పింఛన్లకు గాను శనివారం రాత్రి పొద్దుపోయే సరికి 3,04,130 పింఛన్లు పంపిణీ చేశారు. ఇంకా 12వేల పైబడి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే టీడీపీ నాయకుల ఒత్తిడి, సిఫార్సు మేరకు మంజూరైన పింఛన్లు కూడా చాలా వరకు జిల్లాలో ఆపేశారు. తాము చెప్పిన వాళ్లకు పింఛన్ సొమ్ము ఇవ్వొద్దని హుకుం జారీ చేయడంతో అధికారులు ఏం చేయాలో పాలుపోక పంపిణీ చేయకుండా పెండింగ్‌లో పెట్టారు.

అప్పట్లోనూ అంతే..

2014–19లో కూడా చంద్రబాబు ఇదే రకంగా వ్యవహరించారు. అప్పట్లో టీడీపీ అధికారంలోకి వచ్చేసరికి జిల్లా వ్యాప్తంగా 2,99,925 పింఛన్లు ఉండగా మూడు నెలల పరిపాలన పూర్తయ్యే సరికి 74,194 పింఛన్లు తీసేసి పింఛన్ల భారాన్ని తగ్గించుకున్నారు. ఇప్పుడదే చేస్తున్నారు. కాకపోతే, ఒక్కసారిగా వ్యతిరేకత, న్యాయస్థానాల జోక్యంతో బూమ్‌రాంగ్ అవుతుందని పథకం ప్రకారం నెలనెల పింఛన్లు తగ్గిస్తూ తన అసలు స్వరూపాన్ని బయటపెడుతున్నారు.

కొత్తవి రావు..

గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో పింఛన్ల కోసం లబ్ధిదారులు ఎప్పటికప్పుడు దరఖాస్తు చేసుకుని నమోదు చేయించుకునే అవకాశం ఉండేది. పరిశీలన పూర్తయ్యాక పింఛన్ల మంజూరు జరిగేది. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. ఇంతవరకు కొత్త పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశమే కల్పించలేదు. బీసీలకు, మైనారిటీలకు 50ఏళ్లకే పింఛన్ మంజూరు చేస్తామని చెప్పినా.. ఇంతవరకు దానికి సంబంధించి అతీగతి లేదు. 50 ఏళ్ల వయసు గల వారికి పింఛన్ అమల్లోకి వస్తే జిల్లాలో 3,05,537 మంది వరకు అర్హులున్నారు. కానీ వారి ఆశలను అడియాశలు చేస్తూ సర్కార్ కాలయాపన చేస్తోంది.

ఈ ఏడాది జూన్ నాటికి జిల్లాలో ఉన్న పింఛన్లు :	3,19,702
జూలై ఒకటి నాటికి మొత్తం పింఛన్లు :	3,19,147
ఆగస్టు ఒకటి నాటికి మొత్తం పింఛన్లు :	3,18,017
సెప్టెంబర్ ఒకటి నాటికి మొత్తం పింఛన్లు :	3,16,883



రణస్థలం: జేఆర్ పురంలో పింఛన్‌దారులను ఒకే చోటకు పిలిచి పింఛన్లు ఇస్తున్న అధికారులు

పేదవాడిపై ప్రతీకారం భావ్యమా?



ప్రభుత్వం రెండేళ్ల కిందట నాకు వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి నెల పెన్షన్ ఆపసోపాలు పడితే నానా అవస్థల మధ్య అందించారు. ఆగస్టు ఒకటో తేదీన అందరిలాగే నేను కూడా పెన్షన్ అందుకుంటానని ఎదురుచూశాను. కానీ నాకు అధికారులు అందించలేదు. దీనిపై ఎంపీడీఓకు ఫిర్యాదు కూడా చేశాను. కానీ నాకు నిబంధనలకు విరుద్ధంగా పెన్షన్ నిలిపేశారు. తాజాగా ఒక రోజు ముందు ఆగస్టు 31నే పెన్షన్ ఇస్తున్నామని అనడంతో రెండు నెలల పెన్షన్ అందిస్తారని ఆశపడ్డాను. కానీ కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించి నాలాంటి పేదోడి పెన్షన్ ఆపేశారు.

– శఠగోపం రాంబాబు, కె.కొత్తూరు, కవిటి మండలం

దంతలో 88 సామాజిక పింఛన్ల నిలిపివేత

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండలం దంత పంచాయతీలో 88 సామాజిక పింఛన్లను డీఆర్‌డీఏ అధికారులు శనివారం నిలిపివేశారు. వీరిని అనర్హులుగా గుర్తిస్తూ పింఛన్ సొమ్ములు ఇవ్వలేదు. ఇటీవల స్థానిక టీడీపీ నేతలు వీరిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా.. ఆయన డీఆర్‌డీఏ అధికారులను విచారణకు ఆదేశించారు. డీఆర్‌డీఏ అధికారులు, జిల్లా సదరం అధికారులు, మత్స్యశాఖాధికారులు గ్రామంలో విచారణ నిర్వహించి 88 మందిని అనర్హులుగా తేల్చారు. శనివారం వీరికి పింఛన్ డబ్బులు ఇవ్వలేదు. దీనిపై ఎంపీడీఓ కె.ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ డీఆర్‌డీఏ అధికారుల నుంచి తమకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదని, అందుకే పింఛన్లు ఇవ్వలేదని, సోమవారం తదుపరి ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

ఇద్దరు సీఐలకు స్థానచలనం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకు చెందిన ఇద్దరు సీఐలకు బదిలీ అయినట్లు శనివారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. శ్రీకాకుళం మహిళా పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న చోళంగి వెంకటరావు విశాఖపట్నం నాలుగో టౌన్‌కు, డీటీసీలో ఉన్న జి.నిర్మల ఉమెన్ పీఎస్ జోన్-1కు బదిలీ అయ్యారు. శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్ఐ కె.కామేశ్వరరావు అనకాపల్లి స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

ఖోఖో జట్ల ఎంపిక వాయిదా

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సబ్ జూనియర్స్ బాలబాలికల ఖోఖో జట్ల ఎంపికలు వాయిదా పడ్డాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా ఆదివారం ఉదయం జరగాల్సిన ఖోఖో జట్ల ఎంపికలను వర్షాల కారణంగా వాయిదా వేసినట్టు సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిట్టి నాగభూషణం, సీహెచ్ ఫల్గుణరావు తెలిపారు. తదుపరి ఎంపికల తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 94419 14214 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

న్యాయం చేయండి



భర్త ఇంటి ముందు నిరసన తెలియజేస్తున్న భార్యాపిల్లలు

టెక్కలి రూరల్: స్థానిక రామదాసుపేట వీధిలో సుహాసినీ అనే వివాహిత శనివారం తన భర్త ఇంటి ముందు నిరసనకు దిగింది. తనకు న్యాయం చేయాలని వేడుకుంది. టెక్కలికి చెందిన కోతి రామకృష్ణకు సుహాసినికి కొన్నేళ్ల కిందట వివాహం జరిగింది. అయితే తన భర్త టెక్కలిలో వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను, తన పిల్లలకు అన్యాయం చేస్తున్నాడని ఇంటి ముందు బైఠాయించి నిరసన తెలియజేసింది.

నేడు ఎస్టీయూ నిరసన



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణ

శ్రీకాకుళం న్యూకాలనీ: సీపీఎస్ రద్దు చేయకుండా ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ ఆదివారం కలెక్టరేట్ ప్రాంగణం వద్ద నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణ పిలుపునిచ్చారు. శనివారం శ్రీకాకుళంలో సంఘ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదించిన గ్యారెంటీ పెన్షన్ స్కీమ్(జీపీఎస్), కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఏకీకృత పెన్షన్ స్కీమ్(యూపీఎస్)లకు వ్యతిరేకంగా ఉద్యోగుల కంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ విధానమే తమ ఆశయమని స్పష్టంచేశారు. సీపీఎస్ అమల్లోకి వచ్చిన సెప్టెంబర్ ఒకటో తేదీన సాయంత్రం 4 గంటలకు నిరసన కార్యక్రమం చేపడుతున్నట్టు చెప్పారు. ఎస్టీయూ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'నిందితులను శిక్షించాలి'



మాట్లాడుతున్న పీఓడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి కుసుమ

కాశీబుగ్గ: గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినుల వసతి గృహంలో రహస్యంగా కెమెరాలు పెట్టిన ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రగతి శీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుమ డిమాండ్ చేశారు. పలాస మండలం బొడ్డపాడులో ఆమె విలేకరులతో మాట్లాడారు. కళాశాల వసతి గృహంలో హిడెన్ కెమెరాలు పెట్టి చిత్రీకరించడం అత్యంత దుర్మార్గమన్నారు. నిందితులపై క్రిమినల్ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. ఆ హాస్టల్ యాజమాన్యం కళాశాల యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకోవాలని క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా నాయకులు పాల్గొన్నారు.

గిరిజన సహకార సంస్థ, సీతంపేట

ఫోన్ నెంబర్: 7989189200 / 8500956205

రేఖ నెం. 10/2020/D, తేదీ: 31.08.2024

టెండర్ కమ్ ఆక్షన్

సీతంపేట ఐటీడీఏ పరిధిలో గల గిరిజన వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, ఏపిఆర్‌జెసిల వసతి గృహాలకు కిరాణా మరియు తదితర సరుకులు సరఫరా చేయుటకు తే 01-09-2024 దీ నుండి 05-09-2024 సాయంత్రం 5.00 గం॥ల వరకు టెండర్లు స్వీకరించబడును. మరునటి దినము అనగా తే 06-09-2024 దిన శుక్రవారం ఉదయం 10.00 గం॥లకు శ్రీ ప్రాజెక్ట్ అధికారి, సీతంపేట వారిచే సదరు టెండర్లు ఐ.టి.డి.ఎ, యస్.ఆర్.శంకరన్ భవనంలో తెరువబడును. ఆసక్తి గల వ్యాపారస్తులు టెండరు నిబంధనలు, షెడ్యూలును జిసిసి డివిజనల్ కార్యాలయం, సీతంపేట నందు అన్ని పనివేళలలో తగు రుసుము రూ॥ 2,000/- చెల్లించి పొందవచ్చును. మరియు టెండర్లలో పాల్గొనదలచినవారు వారి యొక్క టెండరు దరఖాస్తునకు రూ॥ 1,00,000/- ధరావత్తును ఏదైనా జాతీయ బ్యాంకులో **"డివిజనల్ మేనేజర్, గిరిజన సహకార సంస్థ, సీతంపేట"** వారి పేరున డిమాండ్ డ్రాఫ్ట్ తీసి టెండర్ దరఖాస్తు ఫారంతో జతపర్చవలెను. టెండరు దరఖాస్తు మరియు ఇతర వివరములకు కార్యాలయం పని వేళలలో ఫోన్ నెం. 7989189200 వకు గాని 8500956205 ని సంప్రదించవచ్చును.

సం/- **డివిజనల్ మేనేజరు**, గిరిజన సహకార సంస్థ, సీతంపేట

ఆకులతంపరలో..

ఇసుక దందా



ఆర్‌కేపురం వద్ద గ్రామస్తులు అడ్డుకున్న ఇసుక లారీలు



ఆకులతంపరలో ఇసుక ర్యాంపు రోడ్డుపై తవ్విన ట్రెంచ్

- వంశధార నది నుంచి అక్రమంగా తరలింపు
- ఒడిశా బిల్లులు చూపించి దర్జాగా రవాణా
- ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అనుచరుల నిర్వాకమంటున్న స్థానికులు
- ఆర్.కె.పురం వద్ద శుక్రవారం అర్ధరాత్రి నాలుగు లారీలను అడ్డుకున్న గ్రామస్తులు
- అక్రమ రవాణాపై చర్యలకు డిమాండ్ చేసిన కలమట

కొత్తూరు:

జిల్లాలోని కొత్తూరు మండలం ఆకులతంపర వద్ద ఇసుక దందా సాగుతోంది. వంశధార నది నుంచి ఐదు రోజులుగా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతోంది. చీకటి పడితే వందలాది లారీల్లో ఇసుక అడ్డగోలుగా తరలిపోతోంది. ఇసుక అక్రమ రవాణాపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అండతో ఆయన ముఖ్య అనుచరులు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని, అందుకే అధికారులు కూడా స్పందించడం లేదని స్థానికులు తీవ్రస్థాయిలో ఆరోపణలు చేస్తున్నారు. ఇసుక లారీల రాకపోకలు వల్ల రోడ్లు దెబ్బతింటున్నాయని, గ్రామాల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని, చీకటి పడితో రోడ్డుమీదకు రాలేకపోతున్నాయని భావించిన పలు గ్రామాలకు చెందిన ప్రజలు శుక్రవారం రాత్రి రామకృష్ణాపురం (ఆర్‌కే పురం) వద్ద ఇసుక లారీలను అడ్డుకున్నారు. నాలుగు ఇసుక లారీలను పట్టుకున్నామని రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినా ఎవరు పట్టించుకోలేదని చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ శనివారం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేయటంతో పాటు పరిస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకుని వెళతానని కలమట స్పష్టం చేయటంతో అధికారులు దిగివచ్చారు. రెవెన్యూ అధికారుల పిర్యాదు మేరకు ఇసుక లారీలపై పోలీసులు కేసు నమోదు చేశారు. కలమట స్పందించిన తరువాత తప్పనిసరి పరిస్థితుల్లో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు నోరు విప్పారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన వారు ఎవరైనా చర్యలు తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. ఇన్ని రోజులుగా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే ఎమ్మెల్యే ఎందుకు స్పందించలేదని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఒడిశా బిల్లులతో అక్రమ రవాణా..

ఎమ్మెల్యే మామిడి అనుచరులు లారీ డ్రైవర్లకు ఒడిశాకు చెందిన ఇసుక ర్యాంపు రశీదులను ఇస్తున్నారు. శుక్రవారం పట్టుబడిన లారీ డ్రైవర్ల వద్ద ఈ బిల్లులే కనిపించాయి. జిల్లా నుంచి తరలిపోతున్న ఇసుకకు ఒడిశా బిల్లులు చూపిస్తున్నప్పటికీ అధికారులు స్పందించకపోవటం వెనుక అధికార పార్టీ ఎమ్మెల్యే ఒత్తిడి ఉందని పలువురు చెబుతున్నారు.

గ్రూపులతో ఇసుక దందా బట్టబయలు..

పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ మధ్య ఉన్న గ్రూపులతోనే ఇసుక దందా బయటపడింది. ఎమ్మెల్యే మామిడి అనుచరులు చేస్తున్న ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న స్థానికులకు కలమట అండగా నిలవడం జిల్లాలో చర్చనీయంగా మారింది. లారీ ఇసుక రూ.20 నుంచి రూ.30వేలకు విక్రయిస్తున్నారు.

● స్వల్పంగా పెరిగిన వంశధార



హిరమండలం బ్యారేజీ నుంచి దిగువకు విడిచిపెడుతున్న వరదనీరు

హిరమండలం: హిరమండలం వంశధార గొట్టా బ్యారేజీ వద్ద శనివారం స్వల్పంగా వరదనీరు పెరిగింది. బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఒడిశా కేచ్‌మెంట్ ఏరియాలో రెండు రోజులుగా పడుతున్న తేలికపాటి వర్షాలకు వరదనీరు వచ్చి చేరుతోంది. గొట్టాబ్యారేజీ వద్ద 38.10 మీటర్ల నీటిమట్టం ఉంది. బ్యారేజీలోకి ఇన్‌ఫ్లో 3,610 క్యూసెక్కులు నీరు చేరుతోంది. వచ్చిన నీటిని స్పిల్‌వేతో పాటు ఐదు గేట్లు 20 సెంటీమీటర్లు పైకి ఎత్తి దిగువకు అవుట్‌ఫ్లో కింద 3610 క్యూసెక్కులు విడిచిపెట్టినట్లు డీఈ రంగనాయకులు తెలిపారు. ఎడమ, కుడి ప్రధాన కాలువలకు నీటిని నిలుపుదల చేసినట్లు చెప్పారు. క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు విస్తీరంగా పడితే వరద పెరిగే అవకాశం ఉందన్నారు. ఒడిశా క్యాచ్‌మెంట్ ఏరియాలో కాట్రగడ వద్ద 4.60 మిల్లీమీటర్లు, గుడారి వద్ద 7.20, గుణుపూర్ వద్ద 7.60, కాశీనగర్ వద్ద 7.80, మెళియాపుట్టి వద్ద 40, గొట్ట వద్ద 8.60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు డీఈ వివరించారు.

● ఎక్కడి పడవలు అక్కడే..



బుడగుట్లపాలెం తీరంలో బోట్లు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎడతెరిపి లేకున్న కురుస్తున్న వర్షాలకు మత్స్యకారులు వేటకు దూరంగా ఉన్నారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండటంతో వేటకు దూరంగా ఉండాలని అధికారులు హెచ్చరించడంతో మూడు రోజులుగా డి.మత్స్యలేశం, బడివానిపేట, బుడగుట్లపాలేం, బొంతలకోదూరు, కుప్పిలి గ్రామాల మత్స్యకారులకు ఇళ్లకే పరిమితమయ్యారు. రు. మత్స్యకార గ్రామాలు, సముద్ర తీర గ్రామాల్లో రెవెన్యూ అధికారులు గ్రామ సచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేశారు. తుఫాన్ షెల్టర్లను సైతం సిద్ధం చేశారు. సముద్ర తీర గ్రామాలను పూర్తిస్థాయిలో అప్రమత్తం చేసిన్లు తహశీల్దార్ ఎ.సింహాచలం చెప్పారు.

● దశాబ్దాల చరిత్ర నేలమట్టం



రోడ్డు కూలిన మర్రిచెట్టు

శ్రీకాకుళం రూరల్: గార మండం అంపోలు జంక్షన్ వద్ద సీఎస్‌పీ రోడ్డులో దశాబ్దాల చరిత్ర గల మర్రిచెట్టు శుక్రవారం అర్ధరాత్రి నేలకూలింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వేళ్లతో సహా అమాంతంగా రోడ్డుమార్గంపై వాలిపోయింది. వెంటనే గ్రామస్తులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆర్‌డీఓ సీహెచ్ రంగయ్య యుద్ధప్రాతిపదికన పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులు, సిబ్బంది సహాయంతో చెట్టును పక్కకు తొలగించారు. చెట్టు నేలమట్టం కావడంతో గార, కళింగపట్నం పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది.

● కల్లోల కడలి



అక్కుపల్లి శివసాగర్ తీరం

వజ్రపుకొత్తూరు రూరల్: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కడలి కల్లోలంగా మారింది. అక్కుపల్లి శివసాగర్ తీరంలో సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతూ సుమారు 100 మీటర్ల మేర సముద్రం ముందుకు వచ్చింది. ఆంధ్ర-ఒడిశా సరిహద్దుతో పాటు పరిసర ప్రాంతాలలో వర్షాలు విస్తారంగా కురవడంతో వరదనీరు బెండి గెడ్డలోకి చేరి ఉద్ధృతంగా ప్రవహిస్తూ ఉప్పుటేరుకు చేరుతోంది.

● కొలను కాదు.. క్రీడామైదానమే!



జలమయమైన శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల క్రీడామైదానం చెరువును తలపిస్తోంది. రెండు మూడు రోజులగా శ్రీకాకుళంలో కురుస్తున్న వర్షాలతో మైదానంలో వర్షపునీరు భారీగా చేరడంతో మైదానం నీటితో నిండిపోయింది. దీంతో క్రీడాకారులు శిక్షణకు నోచుకోలేకపోయారు.

హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించారు



ఎస్పీ కార్యాలయ ఆవరణలో ఫిర్యాదు కాపీతో బాధితులు

శ్రీకాకుళం క్రైమ్ : తన కుమారున్ని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని, ఈ విషయమై రణస్థలం పోలీసులకు తెలియజేసినా ఎటువంటి దర్యాప్తు జరపలేదని.. తన కుమారుని మరణానికి కారణమైన వారిని శిక్షించాలని రణస్థలం మండలం సీతంవలస గ్రామానికి చెందిన ధర్మాన ఈశ్వరరావు తన కుటుంబీకులతో కలిసి శనివారం ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేశారు. చిన్న కుమారుడు రమేష్ రణస్థలంలోని పీవీ రామ్మోహన్ హాస్పిటల్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడని చెప్పారు. జూలై 27న ఎప్పట్లాగే ఉదయం ఏడు గంటలకు విధులకు వెళ్లాడని తెలిపారు. అదేరోజు రమేష్ పనిచేస్తున్న హాస్పిటల్ వద్దకి లావేటి గోపి అనే వ్యకి వచ్చి కేశవరాయపాలెం గ్రామం తీసుకెళ్లాడని.. అక్కడ జరిగిన గొడవలో ఇరికించి వారిచేత కొట్టించాడని ఆరోపించారు. అవమానభారం భరించలేక కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని, ఈ విషయంలో అనుమానాలున్నాయని చెప్పారు. ఘటనాస్థలికి అర కిలోమీటరు దూరంలో ఉన్న చెరువు గట్టు పక్కన రియల్‌ఎస్టేట్ షెడ్ ఉందని, అక్కడ సీసీ కెమెరాల్లో నిక్షిప్తమై ఉందన్నారు. విషయాన్ని ఎస్ఐ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ డీఎస్పీతో విచారణ చేయిస్తానని హామీ ఇవ్వడమే కాక రణస్థలం ఎస్ఐ చిరంజీవికి ఫోన్ చేసి దర్యాప్తు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఎస్పీని కలిసిన వారిలో మృతుని సోదరుడు నరేష్, బంధువులు వెంకటరావు, గొల్లబాబు తదితరులున్నారు.

సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం



పోలీసు కుటుంబీకుల సమస్య వింటున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : పోలీసు సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తామని ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం 19 మంది పోలీసు కుటుంబాలతో సమావేశమైన వ్యక్తిగత సమస్యలు, శాఖాపరంగా ప్రభుత్వం నుంచి రావాల్సిన భద్రత, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, విడో, కార్పస్‌ఫండ్, అడిషనల్ కార్పస్‌ఫండ్, గ్రూప్ ఇన్సూరెన్సు స్కీమ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ నగదు, కారుణ్య నియామకాలు తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హోంగార్డుల సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రినాయుడు, పరిపాలనాధికారిణి జి.శోభారాణి, కార్యాలయ సూపరింటెండెంట్లు కోటేశ్వరరావు, బాలరాజు, లిల్లీభాయ్, ఆర్ఎస్ఐలు వెంకటరమన, హరినారాయణ, పోలీస్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.రాధాకృష్ణ, సీసీ శివకుమార్, పీఆర్వో భాస్కర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యాంత్రీకరణతో సేద్యం లాభదాయకం



యువ రైతులకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

ఆమదాలవలస: యాంత్రీకరణతో వ్యవసాయం లాభదాయకమవుతుందని కృషివిజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. ఆమదాలవలసలోని కేవీకేలో ఆత్మ ఆర్థిక సౌజన్యంతో వారం పాటు నిర్వహించనున్న యాంత్రీకరణపై యువరైతులకు శిక్షణ కార్యక్రమంలో శనివారం ఆమె పాల్గొని పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.నీలవేణి మాట్లాడుతూ గ్రామీణ యువతకు అనుభవజ్ఞులైన అధ్యాపకులు, శాస్త్రవేత్తలతో తరగతులు చెప్పిస్తామన్నారు. కొండెంపూడి వ్యవసాయ ఇంజినీరింగ్ శాస్త్రవేత్త డాక్టర్ బాబు మాట్లాడుతూ యంత్రాల పనితీరుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నైర వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.వెంకట్రావు మాట్లాడుతూ కష్టం హైరింగ్ సెంటర్స్ ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ వి.హరికుమార్, డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్, డాక్టర్ ఎస్.అనూష, నైరా వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ డి.చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం తీసుకుని నిందలా?



మాట్లాడుతున్న ఆక్వా రైతులు పాల మహేష్‌రెడ్డి

సంతబొమ్మాళి: ఆక్వా సాగు వల్ల నష్టపోయిన రైతులకు మూడేళ్లుగా నష్ట పరిహారం ఇస్తున్నా తిరిగి తమపైనే నిందలు వేయడం తగునా అని ఆక్వారైతులు ప్రశ్నిస్తున్నారు. సంతబొమ్మాళి మండలం హనుమంతునాయుడు పేటలో శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఎకరాకు రూ.15వేలు చొప్పున ఆరున్నర ఎకరాలకు మూడేళ్లుగా పరిహారం ఇవ్వాలని గ్రామపెద్దల తీర్మానం ప్రకారం ప్రతి సంవత్సరం రైతులకు నష్టపరిహారం అందజేస్తున్నామని చెప్పారు. వాస్తవాలను విడిచి కొందరు టీడీపీ కార్యకర్తలు నిందలు వేస్తున్నారని తెలిపారు. జెడ్పీటీసీ పాల వసంతరెడ్డికి ఈ ఆక్వా సాగుతో ఎటువంటి సంబంధం లేకపోయినా, తన తమ్ముడు అయినందున లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని సర్పంచ్ భర్త పాల మహేష్‌రెడ్డి చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు కూడా రాజకీయంగా ఎవరిని ఇబ్బంది పెట్టలేదని, పంచాయతీ అభివృద్ధికి పాటు పడ్డామని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆక్వా రైతులు రామారావు, నంసింహులు తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు సంఘటన అమానవీయం

పలాస: కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో హిడెన్ కెమెరాలపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిల వినోద్ ఓ ప్రకటనలో కోరారు. నిందితులను తగిన విధంగా శిక్షించక పోతే కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు ఇబ్బందులు కలుగుతాయని పేర్కొన్నారు. వారిని శిక్షించకపోతే పోరాటాలు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతాయని హెచ్చరించారు.

వసతి గృహంలో సమస్యలపై ఆరా



విద్యార్థినులతో మాట్లాడుతున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని వసతి గృహాలను వైస్ చాన్సలర్ కె.ఆర్.రజిని, అధికారులు శనివారం పరిశీలించారు. మౌలిక వసతులు, సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేసి శుద్ధి జలాలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. నాణ్యమైన భోజనం, పూర్తిస్థాయిలో బెడ్లు సమకూర్చినట్లు వివరించారు. ర్యాగింగ్ ఫ్రీ క్యాంపస్‌గా వర్సిటీ ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సుజాత, చీఫ్ వార్డెన్ లోకేశ్వరి పాల్గొన్నారు.

తిమడాంలో జ్వరాలపై ఆరా



వైద్యశిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

జలుమూరు: తిమడాంలో ప్రబలిన జ్వరాలపై ఇంటింటి సర్వే నిర్వహించి మందులు పంపిణీ చేశామని సైరిగాం మెడికల్ అధికారి పొన్నాడ గరునాథరావు అన్నారు. శనివారం తిమడాంలో వైద్యశిబిరం నిర్వహించి ఫీవర్ సర్వే నిర్వహించారు. వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేసి ఉచిత మందులు పంపిణీ చేశారు.

బాహుదానదిలో గుర్తు తెలియని మృతదేహం



నదిలో కొట్టుకొచ్చిన మృతదేహం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఈదుపురం బాహుదా నదిలో శనివారం రాత్రి గుర్తు తెలియని మృతదేహం కనిపించడంతో స్థానికులు భయందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్సై ఈ.శ్రీనివాస్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. నీటిలో ఉండటంతో మృతదేహం ఉబ్బిపోయి గుర్తు పట్టలేనంతగా మారింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇచ్ఛాపురం సామాజికి ఆసుపత్రికి తరలించారు. కాగా, శుక్రవారం ఉదయం అపరిచిత యువకుడు సైకిల్‌పై బాహుదానదిపై వెళ్తూ ప్రమాదవశాత్తు నదిలో కొట్టుకుపోయినట్లు కొందరు స్థానికులు చెబుతున్నారు.

వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

నరసన్నపేట: నరసన్నపేట బైపాస్ రోడ్డుపై వృద్ధుడు సిద్ధాంతం సత్యం(70) మృతి చెందినట్లు నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గప్రసాద్ తెలిపారు. రణస్థలం మండలం కొండములగాంకు చెందిన సత్యం అనారోగ్యంతో ఉండగా శ్రీకాకుళంలో కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో జాయిన్ చేశారని, అక్కడి నుంచి చెప్పకుండా బయటకు వచ్చేసి నరసన్నపేటలో రోడ్డుపై పడిపోయాడని తెలిపారు. శుక్రవారం రాత్రి స్థానికులు సమాచారం ఇస్తే వెళ్లి పరిశీలించామని, వెంటనే 108 సిబ్బంది వచ్చి పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారని తెలిపారు. శనివారం ఉదయం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

స్తంభం పైనుంచి పడి యువకుడికి గాయాలు



తీవ్రగాయాల పాలైన బాలరాజు

టెక్కలి రూరల్: విద్యుత్ స్తంభం పైనుంచి జారిపడి యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. గొల్ల సీతాపురం గ్రామానికి చెందిన బొమ్మాళి బాలరాజు టెక్కలి పంచాయతీ కార్యాలయం పరిధిలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. శనివారం చిన్నబజార్ వెళ్లే దారిలో స్తంభంపైకి ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై కిందకు పడిపోయాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో వెంటనే టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు సమాచారం అందించారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

FLAT FOR SALE

■ 3BHK FLATS FOR SALE RERA APPROVED (G+4) 2130 SFT Surya Sadhan Residency, Shanthi Nagar colony, శ్రీకాకుళం. 100% వాస్తు, లోన్ సౌకర్యం. Cell: 9666000387 [S-793799]

PROPERTY FOR SALE

■ Hyderabad, Begumpet, Shyamlal Building Near Hyderabad Public School, New Construction Individual Semi commercial (Running Hospital) Building with Finished work 200 yds., G+4 Floors for sale. Rents 2.35 Lakhs per month.Price: 4.90 crores Ph: 9032015898 [HA-16387]

BUSINESS OFFER

■ We are Ready to Invest Long Term Projects All Over The World : + 918754809650 [IA-7029]

■ ద్వారకాఎంటర్‌ప్రైజెస్‌పేపర్‌ప్లేట్స్ & LED మిషన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515624, 8800496710 [G-2157]

WANTED

■ కావలెను : రెసిడెన్షియల్‌గా పని చేయుటకు నిడదవోలు / శంకరాపురం గ్రామం హృదయాలయం దివ్యాంగుల ఆశ్రమంలో రెసిడెన్షియల్ ఉద్యోగులు అనుభవం కలిగిన Administrator (B.Ed/Spl.B.Ed) Lady Warden....2 No.s, ఇంటర్ పాస్/ డిగ్రీ, వంటవారు (స్త్రీ)....3, ఆయమ్మలు....2, మేల్ వార్డెన్ ... 2 డిగ్రీ లేదా ఇంటర్, స్వీపర్ ...1, డ్రైవర్ ....1, సెల్ : 94409 42148, 62817 04979 [P-1038]

■ MS కంపెనీలో ఇంటి వద్దనే ఉండి టెలికాలింగ్ చేయుటకు పార్ట్ టైం / ఫుల్ టైం, మేల్ / ఫీమేల్ కావలెను. Qly: 10th, జీతం: 16000 to 18000. ఫోన్: 9550853907,8885238709 [HA-496]

■ కష్టపెట్టే కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు, ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు-40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం, HYD. ఫోన్: 6309020999 [HA-98313]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు వంట/ఇంటి పని కి వర్కర్స్/నర్సులుకావలెను.ఫ్రీ వసతి+భోజనం .జీతం 20K.ఫోన్: 8977639662, 8977639663 [HA-1379]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడి సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు,వాచ్‌మెన్స్,హౌస్‌కీపింగ్, భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901 [HA-14548]

■ Wanted Male and Female work for MNC Company Qul: 10th to Degree, Sal: 15k to 25k cont: 9502712418 (work from home facility is available) [G-9022]

■ వైజాగ్ ఎక్స్‌ప్రెస్ పత్రికకు జిల్లాలు, మండలాల వారీగా విలేకర్లు కావలెను. 16 సంవత్సరాల నుండి నడుస్తున్న ఉత్తరాంధ్ర పత్రిక. ✆ : 88974 69303, 85004 59713 [V- 776800]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.